
# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక
05-10-04 (2)



**శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు**

పశ్చిమగోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్: 534 265

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 10-10-2004 | ఆది | జిన్నూరు, శ్రీ రమణక్షేత్రం |
| 17-10-2004 | ఆది | అత్తిలి ఆంజనేయస్వామి గుడి, పోస్టు ఆఫీస్ వీధి |

# "దృష్టి మార్చుకొంటే - దృశ్యం మారుతుంది"

మనం తల్లిగర్భం నుంచి బైటపడ్డ క్షణం నుంచి సంస్కారభూయిష్టమైన మనస్సు ద్వారా దృశ్యాలను ఆశక్తిగా చూడటం అలవాటు చేసుకొన్నాము తద్వారా మరల అనేక సంస్కారాలు పోగుచేసుకుంటాము. అందుకే "కన్ను పెద్ధగమ్మం" అంటారు. దూరదృష్టిగలవారు - దృశ్యాలకు దూరంగా ఉంటారు. కల్పనాచాతుర్యం గల మనస్సు నశించిపోయే దృశ్యాలను ఆలంబనగా పెట్టుకొని మరిన్నిసార్లు ఆదృశ్యాన్ని చూడాలని నిత్యం ఉవ్వెళ్ళురుతుంది. మనస్సుకు రూపం అంటే ఇష్టం కనుక. మనం చూచేయీ దృశ్య ప్రపంచము సత్యంగా భావిస్తే మనం బంధింపబడే ఉంటాము" శరీరము అది చూచే ప్రపంచము నేను కాదని తెలుసుకొని దేహతాదాప్యాన్ని విడనాడాలి ఆత్మేనేనని తెలుసుకొని ఆబావనతో ధ్యానంలోనిలవాలి. ఆత్మజ్ఞానాన్ని కూడా మర్చిపోయి నిశ్చల చైతన్యంగా నిలిచిపోవాలి" అన్నారు శంకరులు. మన ఉత్నతికి పతనానికి మనమే కారణం. మనస్సులో ఏవో కోరికలు వచ్చిదానికి ఆకర్షితులై అసహజ స్థితిలోకి వెళ్లి-అడివిలో ఫడతాము. నిజాయితీగా సాధన చేసే వారంతా దృశ్యం అంతా రక్త మాంసాల పంజరమే అని ముందు గుర్తించాలి. మన వివేకాన్ని పవిత్రతను, ఏకాగ్రతతను, అప్పడే - అక్కడే, కష్టపడి సమకూర్చుకోవాలి. దృశ్యాన్ని విధ్యగా గుర్తించగల్గిన మనస్సు ముక్తి స్థితిలో ఉంటుంది. శ్రీనాన్నగారు అంటారు. "మనస్సుని గ్రహించటం కష్టమే సాధన వైరాగ్యం లేనిదే అదుపులోకిరాదు - విషయ చింతన నుండి దాన్ని దైవచింతనలోనికి తేవాలి. మనస్సు దాని అలవాట్లు అది పోగొట్టుకోనప్పడు, మన అభ్యాసాన్ని మనం విడిచిపెట్టకూడదు" అన్నారు. కల్లోలిత మనస్సు సత్యాన్ని దర్శించజాలదు. గత జన్మలో సాధన చేస్తే ఈ విషవలయం నుంచి తేలికగా బైటడవచ్చు అదిలేని వారు సద్గురువుచరణాలపై ప్రయత్న పూర్వకంగా దృష్టినినిలిపి, తన నిస్సహాయ తను ఒప్పకొని, సద్బుబుద్ధిని ప్రసాదించమని కన్నీటితో ప్రార్ధించాలి, దానికి కారణం మన సంస్కారాలు ఏనుగు రూపంలో ఉన్నాయి మన ప్రయత్నము దోమపోటు, సింహంలాంటి గురుచూపుతో ఏనుగులాంటి సంస్కారాలు చిక్కిశల్యమౌతాయి. సంఖాను సంఖలుగా వచ్చిపడే విషయవాసనలు అనే మబ్బులు అప్పడు ఎక్కడికిపోయాయి, ఏమైపోయాయి అని సాధకుడు సంభ్రమాశ్చర్యాలకులోనై ఈ నిర్మల ఆకాశం ఎదురుకావటానికి గురువే కారణమని, ఆరోగానికి అదే మందని అనుభవపూర్వకంగా తెలుసుకొని నిర్మలంగా ఉంటాడు.


**సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం

**5-10-2004**



ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 10 సంచిక : 2 పుష్పం : 4-6 05-10-2004

**RAMANA BHASKARA**
*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*
PAGES : 16
VOL : 10 ISSUE : 2
EDITOR
*P.S. RAMA RAJU*
EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-9-04, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనుషులలో కొంతమంది వ్యవసాయం చేస్తున్నారు, కొంతమంది ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్నారు, కొంతమంది డాక్టర్లుగా చేస్తున్నారు, కొంతమంది వడ్రంగి పనిచేస్తున్నారు. పొట్ట పోషణకోసం ఇలా రకరకాల వృత్తులు చేస్తున్నారు. మీరు ఏ వృత్తిలో ఉన్నా ఇబ్బందిలేదు, అహంవృత్తిలో మాత్రం ఉండకూడదు అన్నారు భగవాన్. మీ వృత్తి మిమ్మల్ని బంధించదు, అహంవృత్తి బంధిస్తుంది. వృత్తులు చేసేవారు అందరూ డబ్బు సంపాదించాలి అనుకొంటున్నారు అలాగే మనం చేసే పనులు, మనం చేసే సాధన, మనకు ఉన్న వివేకం, విచక్షణ, మనలో ఉన్న మంచితనం వీటి అన్నింటి యొక్క ఫలితం ఆత్మజ్ఞానం పొందాలి అంటే ఇవిఅన్నీకూడా ఆత్మజ్ఞానంలో ఫలించాలి లేకపోతే బండిసున్న. ఈ పనులు అన్నీ మనం చేస్తున్నాము అనుకోండి, మనకు ఆత్మజ్ఞానం రావటంలేదు అనుకోండి ఎక్కడో ఏదో లోపం ఉంది. ఈ పనులవలన ఫలితంరాదా అంటే వస్తుంది, పుణ్యం వస్తుంది, అనుభవిస్తే అదిపోతుంది. మనం ఇక్కడ నుండి విజయవాడ వెళ్ళాలి అనుకోండి రైలునుగాని, బస్సునుగాని ఇలా ఏదో ఒక వాహనాన్ని పట్టుకొని వెళ్ళాలి అలాగే ఆత్మజ్ఞానసముపార్జనకు దేహాన్ని, మనస్సును వాహనాల కింద ఉపయోగించుకోవాలి. దేహాన్ని, మనస్సును ఆరోగ్యంగా చూసుకోవాలి. మీరు ఇతరులను ఎలా హింస పెట్టకూడదో అలాగే మిమ్మల్ని మీరు హింస పెట్టుకోకూడదు ఎందుచేతనంటే మీ లోపల ఉన్న జీవుడు ఈశ్వరుడి యొక్క అంశే. మిమ్మల్ని మీరు హింస పెట్టుకొంటూ ఉంటే అశాంతి వస్తుంది తరువాత శారీరక అనారోగ్యం ప్రారంభమవుతుంది.

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


06-09-04 భీమవరం ........ 1
12-09-04 మంచిలి ........ 5
19-09-04 భీమవరం ........ 12

దేహాన్ని, మనస్సును ఉపయోగించుకొని సత్యసాక్షాత్కారం పొందాలి, అది పొందకుండా ఏదైనా సాధించినా స్వప్నంతో సమానము, అవిఅన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మీరు ఏపనిచేసిన అది ఆత్మజ్ఞానంలో ఫలించాలి, అలా ఫలించకపోతే సున్న. B.A. చాలా కష్టపడి చదివానుకాని ఫెయిల్ అయిపోయాను అంటే ఆమాటకు అర్థం ఏమిటి? అలాగే సాధన బాగా చేస్తున్నాము కాని మాకు జ్ఞానం కలగటంలేదు అంటే ఆమాటకు అర్థం ఏమిటి? ఏ జన్మలో అయినా మనం చేసిన సత్కర్మ అది ఆత్మజ్ఞానంలో ఫలించకపోతే దాని ఫలితం పుణ్యానికే పరిమితం అవుతుంది, అనుభవిస్తే అదిపోతుంది. అది శాశ్వతంకాదు, నిత్యంకాదు. జ్ఞానానికి అందరూ వారసులే, అది ఎవరో ఒకరి సొత్తు కాదు. అయితే మనకు జ్ఞానం పొందటానికి ఎవరు అడ్డువస్తున్నారు? అంటే ఎవరూ అడ్డురావటంలేదు, మీకు మీరే అడ్డువస్తున్నారు. మన స్వార్థమే అడ్డువస్తోంది. కాని ఎవరో ఇతరులు అడ్డువస్తున్నారని మాయ అలా అనిపింపచేస్తుంది. ఇతరుల మీదకు గెంటివేస్తుంది. మనకు నిజమైన దేవుడు అంటే ఇష్టం ఉండదు. నిజమైన దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. బయట దేవుళ్ళు అందరూ జాగ్రదవస్థలో ఉన్నారు మరి నిద్రలో ఎక్కడ ఉన్నారు? నిద్రలో కూడా ఉన్న వాడు నిజమైన దేవుడు. ఆనిద్రలో ఉన్న దేవుడిని పట్టుకోవటానికే ఈశ్రమ అంతా. మనకు బయట కనిపించే దేవుళ్ళు అందరూ మన శరీరం ఎంత నిజమో, పుణ్యపాపాలు ఎంత నిజమో, సుఖదుఃఖాలు ఎంత నిజమోవారు కూడా అంతే నిజం. మన శరీరం ఎలాగయితే వ్యవహారిక సత్యమో బయట దేవాలయాలలో కనిపించే దేవుడు కూడా వ్యవహారిక సత్యమేకాని నిజమైన దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. జ్ఞానమార్గంలోనికి రావటం తేలికే కాని దానిలో నిలబడటం, దానిని పోషించుకోవటం కష్టం. భగవాన్ దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలుతోటి, లోకం తోటి అన్నింటితోటి విడిపోయి మరణానుభవం ద్వారా మరణం లేనిస్థితిని పొందాడు కాని ఇక్కడ ఒక్క విషయం మర్చిపోకూడదు, ఆయన ఇది అంతా దేహం ద్వారానే పొందాడు, ఆత్మజ్ఞానం కోసం అనేక జన్మలు కృషిచేయగా చేయగా ఎప్పుడైతే మీపట్ల భగవంతుడికి దయకలిగిందో అప్పుడు భగవంతుడే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మోక్షం అంటే భగవంతుడై పోవటంకాదు భగవంతుని స్వరూపాన్ని పొందటం. మూలతలంపు మూలంలోనే ఈశ్వరుడు ఉన్నాడు. మనం నిద్రపోతున్నా ఆయన నిద్రపోకుండా, మన నిద్రకు సాక్షిగామన హృదయంలో ఉన్నాడు, ఆయనే నిజమైన దేవుడు. నన్ను తలంపులు బాధపెడుతున్నాయి, ఈ తలంపుల గురించి చెప్పండి అని ఒక అమ్మగారు అడుగుతున్నారు. జీవితంలో అన్నీ తలంపులే. పుట్టుక ఒక తలంపు, చావు ఒక తలంపు, కష్టసుఖాలు కూడా తలంపులే. గాఢనిద్రలో ఎవరికైనా తలంపులు వస్తున్నాయా? అంటే ఎవరికి తలంపులు రావటంలేదు. అయితే గాఢనిద్రలో మనం ఉన్నామా, లేదా అంటే మనం ఉన్నాము. అయితే తలంపులు లేనప్పుడు కూడా మనం ఉన్నాము. జాగ్రదవస్థలో తలంపులు వస్తున్నాయి, గాఢనిద్రలో తలంపులు రావటంలేదు. మరి గాఢనిద్రలో తలంపులు అన్నీ ఎక్కడికి వెళ్ళినాయి? దేహము నేను అనే తలంపును

అంటిపెట్టుకొని ఈ తలంపులు అన్నీ వస్తున్నాయి. గాఢనిద్రలో ఆతలంపు ఎప్పుడైతే అణిగిపోయిందో దానికి వచ్చే ఇతరతలంపులు అన్నీకూడా అణిగిపోతున్నాయి. మరల జాగ్రదవస్థలోనికి రాగానే దేహము నేను అనే తలంపు వచ్చాక లోకవాసన, శాస్త్రవాసన, పుణ్యము, పాపము, లోపల, బయట అన్నీ వచ్చేస్తాయి. ఏది ఉంటే అన్నీ ఉన్నాయో అందులోనుండి బయటకురా, దానిలో నుండి విడుదల పొందటమే మోక్షం. చిత్తం యొక్క వృత్తిని నిరోధించటం యోగం అని పతంజలి మహర్షిచెపితే, అహంవృత్తిలో నుండి విడుదల పొందటం జ్ఞానం అని భగవాన్ చెప్పారు. ఏదో యోగం ద్వారా మూలతలంపు ఎక్కడయితే ఉదయించివస్తోందో అక్కడకు దానిని పంపగలిగితే, దాని మూలాన్ని చూడగానే అది నశిస్తుంది, అక్కడ ఉన్న భగవంతుడే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మన యజమాని మన లోపలే ఉన్నాడు, మూలతలంపు మూలంలో ఉన్నాడు, అంతలోతులకు మనం వెళ్లలేకపోతున్నాము. దానికి తగిన వైరాగ్యం మనకులేదు, మనకు పెద్దలయందు గౌరవంలేదు, సత్పురుషుల సహవాసంలేదు, శాస్త్రం యొక్క అధ్యయనంలేదు. నూటికి నూరుపాళ్ళు స్వార్థపరులకా ఆత్మజ్ఞానం కలిగేది? భగవంతుడు అమాయకుడా మీకు జ్ఞానం ఇవ్వటానికి? నేను అజ్ఞానంలో ఉంటే నేను మీకు చెప్పేది ఏమీలేదు, నేను కనుక జ్ఞానిని అయితే నాకు బోధించటానికి ఇతరులులేరు. నాకుడిచేతిలో ఉన్న జామకాయను ఎడమ చేతిలో పెట్టుకొన్నాను అనుకోండి ఎవరికో ఇస్తున్నాను అనుకోను ఎందుచేతనంటే కుడి చెయ్యినాదే, ఎడమ చెయ్యినాదే. జీవాత్మ ఎప్పుడైతే విశ్వాత్మ అయ్యాడో ఎవరినో ఉద్ధరిస్తున్నాను అనే తలంపుపోతుంది. ఎందుచేతనంటే తనకంటే ఇతరులు ఎవరూలేరు. బుడగ పగిలితే అదిపోదు, అది సముద్రం అవుతుంది. ఎప్పుడైతే జీవలక్షణాలుపోయాయో, వాడు పోడు వాడు విశ్వాత్మ అవుతాడు, విశ్వం అంతా వ్యాపించి ఉంటాడు. విశ్వాత్మ ఎటువంటి శాంతిలో ఉన్నాడో అటువంటి శాంతికి, జ్ఞానానికి వారసుడవుతాడు, మనకు ఒకోసారికోపం వస్తుంది, ఒకోసారి బెంగపెట్టుకొంటాము, ఒకోసారి పొంగిపోతూ ఉంటాము, ఒకోసారి కృంగిపోతూ ఉంటాము, ఇలా రకరకాలుగా ఉంటాము, వీటి అన్నింటికి మనలోపల ఉన్న దుఃఖమేకారణం. ఆ దుఃఖం నుండి విడుదల అయ్యేవరకు ఏదోకోరిక, ఏదో కోపం, ఏదోకాంక్ష ఇలా ఏదో ఒక చెడ్డలోపలనుండి వస్తూనే ఉంటుంది. మన దుఃఖమే మరల మనకు కొత్త శరీరాన్ని తీసుకొని వస్తుంది, నీకు లోపల దుఃఖం ఉన్నంతకాలం జన్మలు వస్తూనే ఉంటాయి, చైతన్యానికి వర్తమానకాలంలేదు, భూతకాలంలేదు, భవిష్యత్ కాలం లేదు, దానికి శరీరంలేదు, చైతన్యానికి దూరం దగ్గరలేదు, అది మన హృదయంలోనే ఉంది. అంతటా దేవుడు ఉన్నాడు అని ఏవో గాలి మాటలు చెప్పటంవలన ప్రయోజనంలేదు, బయట ఉన్నవాడు లోపల ఉన్నవాడు ఒక్కటే అనే అనుభవం ఎప్పుడు కలుగుతుంది అంటే నీ హృదయంలో ఉన్న పరమాత్మ నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అది తెలుస్తుంది. మనం ఒకస్థాయికి చేరుకొన్నాక భౌతికం, ఆధ్యాత్మికం అని తేడా తెలియదు. భగవాన్ అనేవారు కూలి పనికి మూటను మోసేవాడు ఎప్పుడూ నెత్తిమీద మూట ఉంటే బాగుండును అని అను:

జ్ఞానం వచ్చాక దేహం ఉండాలని అనుకోడు, వాడికి దేహం ఉండటంవలన లాభంలేదు, దేహం పోవటంవలన జ్ఞానికి నష్టంలేదు. మనిషిని బంధించేది రూపబుద్ధి, నామబుద్ధి. ఆ రూపబుద్ధిని, నామబుద్ధిని పట్టుకొని అహంవృత్తి వేలాడుతూ ఉంటుంది. ఎప్పుడైతే ఈ రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి విడుదలపొందామో నదివెళ్ళి సముద్రంలో ఐక్యమైనట్లు మనం హృదయంలో ఐక్యమైపోతాము. బాహ్యవస్తువులతోటిగాని, బాహ్యప్రక్రియలతోటిగాని, చావుపుట్టుకలతోగాని,. మంచిచెడులతోగాని సంబంధంలేకుండా నీవు లోపల అద్వైతానుభవం పొందినప్పుడు నీకు స్వతంత్రమైన సుఖం, శాంతి కలుగుతుంది. ఆ సుఖం లోకం మీదగాని, దేహంమీదగాని ఆధారపడదు, అది స్వతంత్రమైనది. ఎప్పుడైతే లోపల ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చిందో అప్పుడు అజ్ఞానంలోనుండి విడుదపొందుతావు, శాంతి నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, అది ఆభవసుఖం, అది పుట్టనిసుఖం అది పూర్ణసుఖం. దేహానికి సంబంధించిన సుఖాలు అన్నీ పుట్టినసుఖాలు. మనకు చనిపోయే దాక ఏదో కాలక్షేపం ఉండాలి కదా, ఈ మూలతలంపు ఏదో ఒకదానిని పట్టుకొని కాలక్షేపం చేస్తూఉంటుంది. ఒకావిడకు నలుగురు కూతుర్లు అనుకోండి. కొన్ని రోజులు ఒక కూతురును పట్టుకొని ఉంటుంది, మరల కొన్ని రోజలు ఇంకో కూతురును పట్టుకొని ఉంటుంది. మూల తలంపు ఇలా ట్రాన్స్‌ఫర్ అవుతూ ఉంటుంది. కొంతకాలం ఒక గురువు మంచివాడని, కొంతకాలం ఇంకొక గురువు మంచివాడని, కొంతకాలం విష్ణువు గొప్పవాడని, కొంతకాలం శివుడు గొప్పవాడని ఇలా ఏదో ఒక గొడవను పట్టుకొని తిరుగుతూ ఉంటుంది. ఇటువంటి పిచ్చి గొడవలు నీకు ఎందుకు? నీ గొడవ ఏదో నీవు చూసుకో అంటున్నారు భగవాన్. మనం ఏ నామాన్ని చేసినా పవిత్రులం అవ్వటం కోసమే, పవిత్రులైనంత మాత్రాన పూర్ణస్థితిని పొందలేము కాని పూర్ణస్థితిని పొందటానికి పవిత్రత సహకరిస్తుంది, కనుక పవిత్రత సంపాదించమన్నారు. మిమ్మల్ని ఎవరైనా సరే తమ భక్తులుగా చేసుకోవాలని అనుకొంటే వాళ్ళు గురువులేకాదు, వారిని నమ్మనక్కర లేదు. మూలతలంపును ఒక గోతిలోనుండి తీసి ఇంకొక గోతిలో దింపవద్దు, మూలతలంపును నువ్వు ఎవరు అని విచారించు. మూలతలంపు నుండి విడుదల పొందటం మోక్షం కాని మూలతలంపును టాన్స్‌ఫర్ చేయటం మోక్షంకాదు. ఎన్ని తలంపులు వచ్చినా మీరు భయపడవద్దు. తలంపులు వస్తున్నాయి అనుకోండి, రండి అనాలి. ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి? దేహంతో తాదాప్యంపొందే నేనుకు అంటే మొదటి తలంపుకు ఇవి అన్నీ వస్తున్నాయి. ఆనేను ఎవరు? అని దానిని ప్రశ్నించుకొంటూ వెళితే అది లోపలకు జరుగుతూ ఉంటుంది, అది లోపలకు జరిగే కొలది ఈ తలంపులు పల్చబడిపోతాయి. అలాగ లోపలకు ఉపసంహరించుకొంటూ, ఉపసంహరించుకొంటూ వెళితే ఎక్కడయితే మోక్షస్థానం ఉందో, ఎక్కడయితే శాంతిస్థానం ఉందో అక్కడకు వెళ్ళి ఆగిపోతావు, అంటే హృదయంలోనికి చేరుకొంటావు. నేను ఎవడను అనే ప్రశ్న వలన మీకు లాభం ఏమిటి అంటే మధ్యవర్తులతో సంబంధంలేకుండా, దేవతలతో సంబంధంలేకుండా డైరెక్టుగా హృదయ గుహలోనికి, మోక్షస్థానంలోనికి వెళ్ళిపోతారు. ఓ

అరుణాచలేశ్వరుడా! ఈ దేహమే నేను, దీనికి సంబంధించినవారే నిజం అనుకొంటున్నాను. ఈ మనస్సే నేను, ఈ మనస్సే నా ఇల్లు అనుకొంటున్నాను, దానితో కలిసి తిరుగుతున్నాను. నువ్వు ఏమిచేసావు అంటే నా కొంపలోనుండి నొప్పిలేకుండా నన్ను బయటకు తీసుకొని వచ్చేసావు, బయటకు తీసుకొని వచ్చి నన్ను వదిలిపెట్టలేదు, నీ ఇంటిలో చేర్చుకొన్నావు, నీ ఇల్లు ఆత్మ, నీ ఇల్లు శాంతి. నన్ను అశాంతిలోనుండి బయటకు తీసుకొనివచ్చావు, శాంతిస్థానంలో కూర్చోబెట్టావు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 12-9-04, మంచిలి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏదైనా ఒక పని చేసేటప్పుడు విసుగ్గా చెయ్యకూడదు, అశాంతిగా చెయ్యకూడదు, ఫలితాన్ని ఆశించకూడదు. మనం అశాంతిగా, విసుగ్గా ఒకపని చేస్తే దాని ఫలితం మనకు చెడ్డగా ఉంటుంది. మనం చేసేపని ప్రేమగా, శాంతిగా , అంతఃకరణశుద్ధితో చేయాలి అప్పుడు ఆ పని తాలుక ఫలితం మనకు మంచిగా ఉంటుంది. మనం ఒక పనిచేస్తే దాని తాలుక ఫలితం ఈజన్మలోనో , రాబోయే జన్మలోనో మనకు అనుభవంలోనికి వస్తుంది. మనం చేసిన పనికి ఫలితాన్ని అనుసంధానం చేసేవాడే దేవుడు అంటారు. ఇక్కడ గుర్తించవలసింది ఏమిటి అంటే మనం చేసే పని చిన్నపని అయినా పెద్దపని అయినా మంచిమనస్సుతో, ప్రేమతో, శాంతితో చెయ్యాలి. దేహప్రారబ్ధాన్ని బట్టి కాలప్రవాహంలో అనేకం వస్తూఉంటాయి. మార్పుకాలానికి ఉంది కాని హృదయంలో ఉన్న బ్రహ్మంకు మార్పులేదు, దానికి కాలంతోటి, చావుపుట్టుకలతోటి, కర్మతోటి ఎట్టి సంబంధంలేదు. మన మనస్సులో ఉన్న సంకల్పవికల్పాలకు అది అతీతంగా వుంది, మన హృదయంలో ఉన్న నిజాన్ని, బ్రహ్మంను అర్ధంచేసుకోవటానికి మనబుద్ధిని సమాయత్తం చేసుకోవటానికే ఈ జ్ఞానయజ్ఞాలు, ఈ సత్సంగ సమావేశాలు. దేహంయొక్క ప్రారబ్ధాన్ని బట్టి దేహం నడుస్తూ వుంటుంది. కాలగర్భంలో ఏముందో మనకు తెలియదు కాని కాలప్రవాహం అన్నీ తీసుకొని వస్తుంది. కాలప్రవాహంలో వచ్చేవి వస్తూవుంటాయి, పోయేవి పోతూ ఉంటాయి. మంచి ఉంటే మంచి, చెడు ఉంటే చెడు వస్తుంది. జన్మలు వస్తూవుంటాయి, గౌరవాలు వస్తూవుంటాయి, అగౌరవాలు వస్తూఉంటాయి, ఓడిపోయిన వారు నెగ్గుతూ ఉంటారు, నెగ్గినవారు ఓడిపోతూ ఉంటారు, ధనవంతులు దరిద్రులు అవుతూ ఉంటారు, దరిద్రులు ధనవంతులు అయిపోతూ ఉంటారు, కాలప్రవాహంలో ఇవిఅన్నీ జరుగుతూ ఉంటాయి, యిదంతా ప్రకృతి. నేను చెప్పే ఈమాటలకు, లోపల హృదయంలో ఉన్న సద్వస్తువుకు ఏమీ సంబంధంలేదు. కాలగర్భంలో ఏమి ఉందో తెలుసున్నవాడు నారాయణుడు ఒక్కడే, ఆయనే మన యజమాని, జీవకోటిని నడిపించేవాడు ఆయనే, దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు, జీవుడు లోపలే ఉన్నాడు. మనకు జీవుడి తాలుక వికారాలు తెలుస్తున్నాయికాని దేవుడి తాలుక వైభవం మనకు తెలియటంలేదు. దేవుడు మనలోపలే ఉన్నా ఆయన మనకు అనుభవంలో లేడు, జీవుడు

అనుభవంలో ఉన్నాడు కాబట్టి వాడి వికారాలు మనకు తెలుస్తున్నాయి. మనకు ఏది ప్రత్యక్షంగా అనుభవంలో ఉందో అది మనకు తెలుస్తుంది కాని ప్రత్యక్షంగా అనుభవంలో లేనిది మనకు తెలియదు, మన ఇంద్రియాలకు, మనమనస్సుకు, ఈ జీవుడికి ఆధారంగా ఉండి, మన హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడే గోవిందుడు, అందుకే మొదటిముద్ద తినేటప్పుడు గోవిందనామాన్ని స్మరించుకొని తింటే అది ప్రసాదమవుతుంది అని పెద్దల ఉవాచ. చీకటిలోనుండి వెలుతురులోనికి రమ్మని వేదం చెపుతోంది. చీకటి, వెలుతురుఅంటే ఈ బాహ్యంగా కనిపించేవికాదు. జీవుడిగా జన్మించటం చీకటి. జీవుడు తానుకాని శరీరాన్ని, ధనాన్ని, గౌరవాలను, అధికారాన్ని తాను అని చెపుతాడు, తానుకానిదానితో తాదాప్యం చెందుతూ ఉంటాడు. అదే కటికచీకటి. ఇవన్నీ జీవలక్షణాలు, మనం ఈ జీవలక్షణాలను పోగొట్టుకోవాలి. ఫలానావాడు నామిత్రుడు, ఫలానావాడు నాశత్రువు అని చెప్పేది జీవుడే. వాడిని ద్వేషించమని, వీడిని స్తోత్రం చేయమని చెప్పేది జీవుడే, హెచ్చుతగ్గులను తీసుకొనివచ్చేది జీవుడే. ప్రారబ్ధం కొట్టే దెబ్బలు అన్నీ తిని ఏడ్చేవాడు జీవుడే. వాడు చేస్తాడు, అనుభవిస్తాడు. వాడి ప్రక్కనే దేవుడూ ఉన్నాడు, ఆయన ఏమీచెయ్యడు, అనుభవించడు, కాని వీరి చేష్టలను చూస్తూ వుంటారు. మనకు దేహభావన ఉందికాని బ్రహ్మభావన లేదు. దేహభావనే చీకటి, బ్రహ్మభావనే వెలుగు. ఎప్పుడోకాదు, ఎక్కడోకాదు ఇప్పుడే ఇక్కడే నీ శరీరం స్మశానానికి వెళ్ళకముందే, నీ శరీరం కాలిబూడిద అవ్వకముందే నువ్వు దేహభావనను వదిలించుకొని బ్రహ్మభావనలో, ఆత్మభావనలో, ఆమహావెలుగులోనికి ప్రవేశించటమే చీకటిలోనుండి వెలుతురులోనికి వెళ్ళటం. భగవంతుడి సహాయంతో మనం మాట్లాడుతున్నాము, ఆయన ఇచ్చే వెలుతురు సహాయంతో పనులు చేసుకొంటున్నాము కాని ఆయన లేడు అని చెపుతున్నాము, ఇది మన అజ్ఞానానికి గుర్తు. మన శరీరం జడం, ఈ జడానికి కదిలేశక్తి ఎక్కడనుండి వస్తోంది. అంటే లోపల చైతన్యంలో నుండి వస్తోంది. ఆ చైతన్యమే భగవంతుడు అది మర్చిపోవద్దు. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల మీద మనకు ఉన్న నమ్మకం భగవంతుడి మీద మనకు లేదు. ప్రపంచంలోని ఏవస్తువులో గాని, ఏపదార్థంలోగాని సుఖం లేదు, శాంతి లేదు కాని ఉందని నీమనస్సు అనిపింపచేస్తుంది, అదే కటికచీకటి. అందులోనుండి విడుదలపొందితే గాని నువ్వు జ్ఞానానికి వారసుడివి కాలేవు. మనకు మాటమాటకు ఆగ్రహం వస్తూఉంటే మనకు నిగ్రహం లేదు అని అర్థం. మనస్సును ఎలా నియమించుకోవాలి, ఇంద్రియాలను ఎలానిగ్రహించుకోవాలి, జీవితాన్ని ఎలా నియమించుకోవాలి, కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి అని నేర్పేదే యోగం. జీవించి ఉన్నతకాలం ధర్మాన్ని ఆచరిస్తూ నీ డ్యూటీ నీవు చేస్తూఉండు, జరిగేది ఏదో జరుగుతుంది, జరుగరానిది ఏదీ జరుగదు. నీడ్యూటీ కూడా ఎలాచెయ్యాలి. అంటే కర్తలేని కర్మను చెయ్యి. తామరాకు నీటి మధ్యలో ఉన్నా నీరు తామరాకును ఏవిధంగా అయితే తడపదో అలాగే నీవు కర్తలేని కర్మను చేస్తూ ఉంటే నీవు సంసారం మధ్యలో ఉన్నా సంసారం నిన్ను అంటదు, ఆవిధంగా పనిచేయటం నేర్చుకో.

అహంకారంతో నీవు పనిచేస్తూ వుంటే నీవు ఎత్తుకుఎత్తు వడ్డీతోసహా నీవు అనుభవించవలసిందే. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని మన మనస్సు అంగీకరించటానికి సిద్ధంగా ఉన్న, సిద్ధంగా లేకపోయినా భగవంతుడు చెప్పిన వాక్యమే మనకు ప్రమాణము. ఎవడైతే దేవుడు చెప్పిన వాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తున్నాడో వాడు ధన్యుడు అవుతాడు, దేవుని స్వరూపాన్ని పొందుతాడు. శరీరం మిధ్య, శరీరం ఒక తలంపు అనిచెప్పినా శరీరం ఉన్నంతసేపు దానికి అన్నం పెట్టాలి, దాని ఆరోగ్యం చూడాలి అది మర్చిపోకూడదు. మనంకారులో వెళుతున్నాము అనుకోండి, ఆకారు మనం కాకపోయినా దానికి ఆయిల్ పోయాలి, బాడిపడితే తుడుస్తూ ఉండాలి. అలాగే ఈ శరీరం మనం కాకపోయినా దానిని జాగ్రత్తగా చూసుకొంటూ జ్ఞానంపొందటానికి దానిని ఉపయోగించుకోవాలి. మన పని ఏదో మనం చేసుకొంటూ, భగవంతుడు అవకాశం ఇస్తే ఇతరులకు సహాయసహకారములు అందిస్తూ అది కూడా నిరహంకారంగా, నిరాడంబరంగా చేస్తూ ఉంటే అది జ్ఞానోదయానికి నీకు సహకరిస్తుంది. నువ్వు ఏ పనిచేసినా ఏమాట మాట్లాడినా, జపం చేసినా, ధ్యానం చేసినా భగవంతుడిలో ఐక్యంఅవ్వటం దృష్టిలో పెట్టుకొని చెయ్యి. నువ్వు ఏ ఆశ్రమంలో ఉన్నా మోక్షమార్గాన్ని విడిచిపెట్టవద్దు. సక్రమమైన మార్గాన్ని విడిచిపెట్టేస్తే, సక్రమమైన ఆలోచనను విడిచిపెట్టేస్తే నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు దొరకదు, రైట్‌యాక్షన్. రైట్‌స్పీచ్, రైట్‌బిహేవియర్ ఉంటే కదా నీహృదయంలో ఉన్న సత్యం నీకు తెలిసేది. ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే వాడి మనస్సు నిండా ఈశ్వరుడు నిండి ఉంటాడు. చెఱువులోని నీరు కుళాయిద్వారా మన ఇంటికి ఎలా వస్తుందో అలాగ మనం ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే ధర్మం అనే కుళాయి ద్వారా హృదయంలోని జ్ఞానగంగ వచ్చి మనసహస్రారాన్ని జ్ఞానంతో, శాంతితో నింపుతుంది. అప్పుడు ఎటుచూసినా ఆనందమే, అసలు జీవితానికి, మరణానికి బేధంలేదు. ఆబేధం లేదన్న అనుభవం, అబేధస్థితిని ఇప్పుడే ఇక్కడే ఈశరీరం ఉండగానే పొందాలి. అలా పొందకుండా ఈ శరీరం విడిచిపెడితే ఎక్కడికో జారిపోతాము. ప్రారబ్దాన్ని అనుసరించి ఇతరలోకాలకు వెళ్ళవచ్చు. మరల జన్మలు రావచ్చు. అందుచేత ఈ శరీరం ఉండగానే ప్రయత్నంచేసి పొందవలసింది ఏదో పొందాలి. ఈమధ్య ఒక రిటైర్డ్‌టీచర్ మా ఇంటికి వచ్చారు. ఆవిడ ఒకమంచి మాట చెప్పారు. నాన్నగారు నాకు ఇంకేమీ తలంపులేదు. ఆలోచనలేదు, శివుడిదగ్గరకు వెళ్ళిపోవాలి అన్నారు. శివుడు దగ్గరకు వెళ్ళటం ఎలాగ? శివుడి దగ్గరకు వెళ్ళటం అంటే శివుడిగా ఉండగలగటమే. శివుడు అంటే అంతట వ్యాపించినవాడు, అంతటా వ్యాపించిన వస్తువుకు కదలటం ఏముంటుంది, మీరుకూడా అలాగ అయిపోండి అని ఆ అమ్మగారితో చెప్పాను. ముందు మీరు శ్రవణంచేయండి, ఏది పొందాలో ముందు తెలుసుకోండి తరువాత ప్రయత్నం చేయండి. అవినయంగా ఉండవద్దు. ఒకవేళ దేహప్రారబ్ధంలో మీకు ఐశ్వర్యం వచ్చినా మీరు వినయం విడిచిపెట్టవద్దు. ధనం దానంతట అది చెడ్డదికాదు, దానిని మనం ఉపయోగించుకోవటంలో ఉంటుంది. అలాగే పనికూడా చెడ్డదికాదు, నేను చేస్తున్నాను

అనే తలంపు చెడ్డది. కాలప్రవాహానికి ఎదురీది నిలబడగల శక్తి ఈసృష్టిలో దేనికీ లేదు. నీ శరీరం ఎంత? నువ్వెంత? పెద్దపెద్ద సామ్రాజ్యాలే కాలప్రవాహంలో కొట్టుకొని పోయాయి. కాలాన్ని నడిపించేవాడు ఈశ్వరుడు, ఆయనే మనకు యజమాని. భగవాన్ అరుణాచలం వచ్చినరోజున ఎలా ఉన్నారో, శరీరం విడిచిపెట్టిన రోజున కూడా అలాగే ఉన్నారు. నీడ లేకుండా గడిపిన రోజులు ఉన్నాయి, ఆశ్రమం కట్టిన రోజులు ఉన్నాయి, డబ్బులేకుండా గడిపిన రోజులు ఉన్నాయి, డబ్బు వర్షం కింద కురిసిన రోజులూ ఉన్నాయి. తిండి లేకుండా ఉన్న రోజులు ఉన్నాయి, అజీర్తితో బాధపడ్డరోజులు ఉన్నాయి. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఇదంతా దేహానికి సంబంధించిన విషయం, ఈదేహం అప్పుడు అలా ఉండవలసివచ్చింది, ఇప్పుడు ఇలా ఉండవలసివచ్చింది, నేను అరుణాచలం వచ్చి కొత్తగా పొందినది అంటూ ఏమీలేదు, నేను నష్టపోయింది ఏమీలేదు, సంపాదించినది ఏమీలేదు అన్నారు, అదీఆత్మ, అదీ చైతన్యం. మీ అత్తగారికి కోపంవచ్చి, ఆవిడకేదో వికారంవచ్చి ఒకరోజు మీతో మాట్లాడటం మానివేస్తే మీరు బెంగపెట్టుకొంటే ఇంక మీకు జ్ఞానం ఏమిటి? జీవలక్షణాలనుండి బయటపడకుండా అలవాట్లయొక్క వేగంలోనుండి, సంస్కారముల యొక్క వేగంలో నుండి, తలంపుల యొక్క వేగంలోనుండి విడుదల పొందకుండా నువ్వు చీకటిలోనుండి, అజ్ఞానంలో నుండి ఎలా బయటకు వస్తావు. మీ గ్రహస్థితి అలా ఉంది, ఇలా ఉంది అని కొందరు భగవాన్‌తో చెప్పేవారు. నాకు గ్రహస్థితి ఏమిటి? పుట్టినదానికి గ్రహస్థితి కాని అసలు పుట్టుకే లేనిదానికి గ్రహస్థితి ఏమిటి? అనేవారు మరి మీదేహానికి కురుపువేసింది కదా అని ఎవరైనా అంటారు అనుకోండి ఆదేహం ఏప్రారబ్ధం అనుభవించటానికి వచ్చిందో అది అనుభవిస్తుంది, పోతుంది, దానిగోల నాకేల, అది నేనా? అనేవారు భగవాన్. భగవంతుడు మనహృదయంలోనే ఉన్నాడు కాని మనకు అనుభవంలోలేడు. నీహృదయంలో ఉన్న భగవంతుడిని నీకు అనుభవంలోనికి తీసుకొనివచ్చి నీచేతికి అందించేవాడే గురువు. మీ ఇంట్లోపిల్లలకు మీరు మంచి చెపుతున్నారనుకోండి. వారు విన్నా, వినకపోయినా మీరు మంచి చెప్పండి. అది మనడ్యూటీ, మీరు మంచి చెప్పటం మానకండి. మీరు మంచి చెప్పటం మానేస్తే చనిపోయిన వారితో సమానము. అలాడ్యూటీ చెయ్యటంవలన మీకు ఏమివస్తుంది అంటే అది మీకు సంతృప్తి నిస్తుంది, దానివలన మీరు దేవునిదయకు పాత్రులవుతారు. ధనవంతులు అంతా ఆశ్రమం కట్టుకొని కూర్చుంటే అక్కడకు వెళ్ళేవాడు ఉండడు. రమణమహర్షి గారికి ఏముంది? ఆయన ధరించింది కౌపీనం. ఆయన దగ్గర విష్ణుచక్రం ఉందా, రామభాణం ఉందా? ఆయన మౌనమే ఆయన ఆయుధం, ఆయన హృదయమే ఆయన ఆయుధం. నీ హృదయంలో సత్యం ఉన్నా అది నీకు అనుభవంలోనికి రానప్పుడు లోపల ఉన్నా ప్రయోజనం లేదు. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దాని తాలుక వైభవం నీకు తెలుస్తుంది, జీవితరహస్యం నీకు తెలుస్తుంది. భగవంతుడు ఒక పని చెయ్యమని చెప్పాడు అనుకోండి, దాని గురించి చర్చఅనవసరం, ఆపని చేసిపూరుకోవటం, ఒకపనిచేయవద్దు అని చెప్పాడు అనుకోండి, అది మానివేయటం. అలా ఉండటంవలన

భగవంతుడి దయకుపాత్రులవుతారు, అప్పుడు ఆయనే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. ఎక్కడ మంచి ఉంటే అది మనం నేర్చుకోవాలి. మీలో ఏదైనా మంచి ఉంది అనుకోండి, ఆ మంచిని నేనుచూస్తున్నాను అనుకోండి నాకులాభం ఏమిటి అంటే మీకంటే నేను ఎక్కువ మంచివాడను అయిపోతాను. మీలో ఏదైనా చెడ్డ ఉంది అనుకోండి, ఆచెడ్డను నేను చూస్తున్నాను అనుకోండి మీకంటే నేను ఎక్కువ చెడ్డవాడను అయిపోతాను. మీలో ఉన్న మంచిని చూస్తే నేను బాగుపడతాను, మీలో ఉన్న చెడ్డను చూస్తే నేను పాడైపోతాను. మీకు దేహప్రారబ్ధం ఏది తీసుకొనివస్తే దానితో సంతృప్తిపడు, కాని జ్ఞానం విషయంలో ఆత్మజ్ఞానం వచ్చేవరకు సంతృప్తి పడవద్దు అని చెప్పారు అంటే దేహప్రారబ్ధంలో పదవులు వచ్చినా, పైసాలువచ్చినా ఏదివస్తే దానితో సంతృప్తిపడు కాని జ్ఞానం విషయంలో లోపల ఉన్న వస్తువు అనుభవంలోకి వచ్చేవరకు సంతృప్తిపడవద్దు. జ్ఞానం గురించి అడిగి తెలుసుకొనే కాంక్ష మీకులేకపోతే, ఆ జిజ్ఞాస కనుక మీకు లేకపోతే మీఇంటినిండా డబ్బుఉన్నా, ఎంతబంగారం ఉన్నా మీకు భావదారిద్ర్యం తప్పదు, మనస్సులో దారిద్ర్యం ఉంటుంది. మీరు ఇంటిలో రిచ్‌గా ఉంటారు గాని మనస్సులో దారిద్ర్యం అనుభవిస్తారు. లోపల ఏదో వస్తువు వుంది అంటున్నారు, దానిని తెలుసుకోవాలనే తపన ఉంది, ఆతపన బాగా బలపడేలాగ చెయ్యండి అందుకే మీదర్శనానికి వచ్చాను అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నీకుఉన్న తపనే నీకు దైవసాక్షాత్కారం తెచ్చిపెడుతుంది అంటున్నారు భగవాన్.

మోక్షం అంటే ఏమీలేదు దేవుడు ఉన్నాడా, లేడా అనే విషయం ప్రక్కనపెట్టండి, రాబోయే జన్మలు ఉన్నాయా అనే విషయం ప్రక్కనపెట్టండి, ఇవిఅన్నీ మనకు తెలిసినా తెలియకపోయినా మన మనస్సు మనకు తెలుస్తోంది కదా, అందులో నుండి విడుదల పొందటమే మోక్షం. మీరు అర్ధం చేసుకొంటే తేలిగ్గా ఉంటుంది, అర్ధం చేసుకోకపోతే ఇదే కష్టంగా ఉంటుంది. ఇదే ఉపనిషత్‌లో ఒక ఋషి ఏమని చెప్పాడు అంటే తెలుసుకొంటే సుఖం, తెలియకపోతే దుఃఖం అనిచెప్పాడు. తెలిసున్న వాడికి ఆవస్తువు అత్యంత సమీపంలో ఉంటుంది, తెలియనివాడికి అది వాడి హృదయంలో ఉన్నాకూడా బహుదూరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. లోపల ఉన్న బ్రహ్మాంతాలుక అనుభవం మీకురాదు అనుకోండి మీకు బాహ్యంగా ఎన్ని సంపదలు ఉన్నా బాహ్యంగా ఎన్ని భోగాలు ఉన్నా, మీరుకోటిజన్మలు ఎత్తినా దుఃఖం మిమ్మల్ని విడిచిపెట్టదు అన్నారు భగవాన్. ఈ వాక్యం కోపంతో చెప్పినదికాదు, మన సంతోషం కోసం చెప్పినదికాదు, ఉన్నది ఉన్నట్లుగా చెపితే ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా ఆ వాక్యాన్ని రుచిచూడటం కోసం చెప్పారు. మీరు కలకత్తా వెళ్లే రైలు ఎక్కికూర్చుని కలకత్తా వెళ్లటం నాకు ఇష్టం లేదు అనుకొన్నా ఆరైలు నిన్నుకలకత్తాలో పడేస్తుంది. అలాగే నీ ప్రవర్తన బాగాఉంటే మీరు ఇతరులకు చేయగలిగిన సహాయం చేస్తూఉంటే, మీ పని ఏదో మీరుజాగ్రత్తగా చేసుకుంటూ ఉంటే, నీ ప్రవర్తన నిగ్రహంలో ఉంటే నాకు మోక్షం అక్కరలేదు అనుకొన్నా మీకు తెలియకుండానే మోక్షం వచ్చి నిన్ను వరిస్తుంది. మిమ్మల్ని చూసి ఎవరైనా అసూయపడుతున్నారు అనుకోండి, వారి అసూయను మీరు చూడకూడదు,

వారి లోపల ఉన్న భగవంతుడిని మీరు చూడడం నేర్చుకోండి, అదిరైట్ బిహేవియర్, అప్పుడు హృదయంలో ఉన్న భగవంతుడు మీకు తొందరగా ఎరుకలోనికి వస్తాడు. ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే హారతికర్పూరం ఏ విధంగా అయితే అగ్నిలో కాలిపోయి ఏమి మిగలకుండా అయిపోతుందో అలాగ మనస్సు కూడా జ్ఞానాగ్నిలో కాలిపోయి మిగలకుండా అయిపోవాలి, అదే మోక్షం. నీ మనస్సును ప్రోపర్‌గా ఉపయోగించుకొన్నావా నీకు మోక్షం, నీమనస్సును సరిగా ఉపయోగించుకోకపోతే అదే బంధం అవుతుంది. ఈ గారిడీ అంతా మనస్సులోనే వుంది. అయితే గురువు అనుగ్రహంలో పడితే ఒకవేళ నీవు బంధంలోపడినా ఆయన కూడా బంధంలోనికి వచ్చి అందులోనుండి నిన్ను బయటకు తీసుకొనివస్తాడు, వాడు గురువు. మీరు కుళాయి తిప్పారు అనుకోండి, నీరురావాలి, నీరురావాలి అని మీరు అనుకోనక్కరలేదు, వాటంతట అవే నీరు వచ్చేస్తాయి అలాగే మనస్సు పత్తాలేకుండా పోయింది అనుకోండి లోపలఉన్న సత్యం నాకు తెలియబడాలి అని మీరు అనుకోనక్కరలేదు, అది మీకు తెలియబడుతుంది. మన శరీరసౌందర్యం కంటే హృదయసౌందర్యం గొప్పది. నిజమైనసౌందర్యాన్ని చూడటానికి మనరెండు కళ్ళు సరిపోవు. మనం రూపసౌందర్యంలోనుండి గుణసౌందర్యంలోనికి వెళితే. గుణసౌందర్యంలోనుండి లోపలఉన్న హృదయసౌందర్యంలోనికి వెళితే మనం ఆసౌందర్యంలో, ఆప్రకాశంలో, ఆమహాశాంతిలో ఐక్యమయిపోతాము, అప్పుడు జీవుడు కనబడడు. ఆంజనేయస్వామి గొప్పభాషాపండితుడు. రాముడు దేవుడు అనుకొంటున్నాము, ఆయనే మురిసిపోయాడు ఆంజనేయస్వామి యొక్క భాషాసౌందర్యానికి అంటే ఆంజనేయస్వామి మాటలకుదేవుడు మురిసిపోతున్నాడు, ఇంక వాడు దేవుడు అవ్వకుండాఎలా ఉంటాడు. భాషలో ఏముంది అనుకోకండి. భాషకూడా జాగ్రత్తగా మాట్లాడాలి, దానివలన మనస్సు సంస్కరింపబడుతుంది. మూలతలంపును అటు ఇటు తిప్పకండి, దానిలోనుండి విడుదల పొందండి. కొంతకాలం చిన్నకూతురు అంటే ఇష్టం, కొంతకాలం పెద్దకూతురు అంటే ఇష్టం ఇలా అహంకారాన్ని ట్రాన్స్‌ఫర్‌లు చేయవద్దు దానిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చేయండి. మీరు ప్రయాణం చేయండి, ప్రయాణం చేయండి, హృదయంలోనికి ప్రమాణం చేయండి. సముద్రం చాలాలోతుగా ఉంటుంది. ఆలోతులలోనికి వెళితే సముద్రంలో ఉన్న రత్నాలు దొరుకుతాయి. అలాగే మనహృదయం కూడా చాలా లోతుగా ఉంటుంది. ఆలోపలకు మనం దిగగలిగితే అంత తూకం మనకు ఉంటే, అంతఅభ్యాసం మనకు ఉంటే, అంత వైరాగ్యం మనకు ఉంటే హృదయం యొక్క లోతులలో ఉన్న ఆత్మముత్యం మనచేతికి అందుతుంది. అది ప్రత్యక్షంగా మనకు అనుభవంలోనికి వస్తుంది. ఇంకా పది సంవత్సరాలు బతకాలి అని అలాపొడిగించుకొని పోవటమే గాని మనకు 50సం॥లు వచ్చాయి, ఏమిసాధన చేసాము, లోపలఉన్న వస్తువును పొందటానికి మనం ఏ ప్రయత్నం చేసాము. కనీసం జీవితంలో ఒకడికైనా ఉపయోగపడ్డామా ? అది లేదు. ఇంకాజీవించాలి, ఇంకాపొడిగించుకోవాలి అంటే ఇలా ఎంత పొడిగించుకున్నా ఎడ్రసు వల్లకాడే.

ఈ శరీరం ఒక అద్దెకొంప. ఇందులో ఉంటున్నాము. కాని మనం ఏమను కొంటున్నాము అంటే ఇది అద్దెకొంప అనుకోవటం లేదు, ఇదే నిజం అనుకొంటున్నాము. ఏదో రోజున అందులో నుండి పొమ్మని చెపుతారు, పోవలసిందే. వాస్తుకు బాగుంది ఇక్కడే ఉంటాం అన్నా పొమ్మంటారు. వారు ఎప్పుడు పొమ్మంటే అప్పుడుపోవాలి. లోపల కంట్రోలర్ ఉన్నాడు. ఈ ఇల్లు శిథిలమైపోయింది, ఖాళీచెయ్యి, నీకు కావలసిఉంటే ఇంకో ఇల్లు ఇస్తాను అంటాడు, అప్పుడు ఈజీవుడు ఆశరీరం విడిచిపెట్టిపోతాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే నువ్వు ఇలా అద్దెకొంపలకు తిరిగినా ఫరవాలేదు, అద్దెకొంపను నీ సొంతకొంప అనుకొంటున్నారు, అక్కడే ప్రమాదం వచ్చింది అంటున్నారు. ఈ శరీరం అద్దెకొంప అని తెలియక ఇదినాదే ఇదినాదే అంటున్నావు. ఎప్పుడో సడన్‌గా పిలుపు వస్తుంది, నీచేత యిది ఖాళీ చేయించేస్తారు, అప్పుడు ఏడుస్తూ కూర్చొంటావు. ప్రారబ్ధాన్ని బట్టి నువ్వు ఎక్కడకి పోవాలో అక్కడికి పోతావు. మనం ఇల్లు కట్టుకొనేవరకు ఈ అద్దెకొంపలు పట్టుకొని తిరగటం ఎలా తప్పదో అలాగ మన నిజమైన ఇల్లు అయిన భగవంతుడిని చేరుకొనేవరకు ఈ జన్మలు అనే కొంపలలో తిరుగుతూ ఉండవలసిందే, భగవంతుని నామాన్ని స్మరించటంవలన, ఆయన రూపాన్ని ధ్యానించటంవలన మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది, ఏదేవుడు కోసమైతే నువ్వు జీవిస్తున్నావో ఆయనతో నీకు తాదాప్యం పెరుగుతుంది. ఇలా ఆరాధించటంవలన మనస్సు అణుగుతుంది, మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది, నెమ్మదిగా మనస్సు పల్చబడి నశిస్తుంది. అప్పుడు మీకు భయాలుపోతాయి, అభయస్థితి కలుగుతుంది. భగవంతుడు అందరికి అవకాశాలు ఇవ్వడు, మీకు ఎవరికైనా అవకాశాలు ఇస్తే వాటిని భగవంతుడిని తెలుసుకోవటానికి ఉపయోగించుకోండి పరమలోభి తనపైసాలను ఎలా చూసుకొంటాడో అలాగ భగవంతుడు ఇచ్చిన అవకాశములను అంత జాగ్రత్తగా ఆత్మజ్ఞానం పొందటానికి ఉపయోగించుకోండి. ఎక్కడ మీకు వేడి కనిపిస్తున్నా అది అగ్ని సంభంధమే అలాగే మనకు తెలివి ఉన్నా, ధనం ఉన్నా, సౌందర్యం ఉన్నా అవిఅన్నీ భగవంతుడు ఇచ్చినవే, అవి మన సొంతం అనుకోవద్దు. భగవంతుడి దయలేకపోతే మనం భగవంతుడిని స్మరించలేము. ఎప్పుడైనా మనకు భగవంతుడు జ్ఞాపకం వచ్చాడు అనుకోండి అప్పుడు మనం ఏమనుకొంటాము అంటే సాధనబాగా చేస్తున్నాం అనుకొంటాము కాని ఆయన మనలను జ్ఞాపకం తెచ్చుకొంటే మనకు ఆయన జ్ఞాపకం వస్తాడు కాని అది మనతెలివితేటలుకాదు. మనకు తెలియని గొడవలు అన్నీ వదిలేయండి, మనస్సు మనకు తెలుస్తోంది, అందులోనుండి బయటకు రండి, అదే మోక్షం. పెంటపోగులో ఎంత పెంట ఉంటుందో మన మనస్సులోఅన్ని వికారాలు ఉంటాయి, మన వికారాలు మనకు తెలుస్తున్నాయి కదా అందులోనుండి బయటకు రావటమే మోక్షం. పద్మపాదుడు ఒకసారి పుస్తకం వ్రాసి శంకరాచార్యుల వారికి చదివి వినిపించాడు, ఆ పుస్తకం జాగ్రత్త పెట్టమని ఆచార్యులవారు చెప్పారు. పద్మపాదుడు రామేశ్వరం వెళుతూ కూడా ఆపుస్తకం పట్టుకొని మేనమామ ఇంటికివెళ్ళాడు. అక్కడ ఆపుస్తకం మేనమామకు చదివి వినిపించాడు. వీడు

ఇంతగొప్ప గ్రంధాలు వ్రాసాడా ఏమిటి అని మేనమామకు అసూయవచ్చింది. పద్మపాదుడిని రామేశ్వరం వెళ్లనిచ్చి ఆ పుస్తకం తగలపెట్టేసాడు. పద్మపాదుడు తిరిగి వచ్చేసరికి దొంగలు పట్టుకొనిపోయారు అని చెప్పాడు, అసూయ అంతపనిచేసింది. అప్పుడు పద్మపాదుడు బెంగపెట్టుకొని ఆచార్యులవారి దగ్గరకు వచ్చి ఏడుస్తాడు. ఆచార్యులవారి ఏకాగ్రత చూడండి. దీనికి ఎందుకు దుఃఖపడటం, నువ్వు ఒకసారి చదివి వినిపించావు కదా (అది300 పేజీల గ్రంధం) ఒక్క వాక్యం తేడా లేకుండా చెపుతాను వ్రాసుకో అన్నారు ఆచార్యులవారు, వాడు ఆచార్యుడు. ఆచార్యులవారికి ఆజ్ఞాపకశక్తి ఇచ్చింది ఎవరు ?సర్వేశ్వరుడు అంటే మరల అక్కడ మనం ఈశ్వరుడిని మర్చిపోకూడదు. నీ మరుపుని నేను, నీ జ్ఞాపకాన్ని నేను అని భగవంతుడు గీతలో చెప్పాడు అంటే ఎవరు ఉన్నారు? మనంలేము మనం సున్నలం, అంతా ఈశ్వరుడే. భగవంతుడిని పూజించగా పూజించగా ఆయనను స్మరించగా, స్మరించగా ఆయనతో ఒకరకమైన అనుభంధం కంటిన్యూ అవుతుంది. అది భౌతికమైన అనుబంధం కాదు, అది అభౌతికమైనది భౌతికమైన అనుబంధాలకు ఏముంది పెట్టినరోజున పూజ, పెట్టనిరోజున పెంట.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-9-04, భీమవరం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏపని ప్రారంభించినా ముందు వినాయకపూజ చేసాక అన్నీ చేసుకొంటాము. వినాయకుడు చాలా తెలివిగలవాడు, వివేకవంతుడు. స్థూలదృష్టి, సూక్ష్మదృష్టి రెండూ ఉన్నవాడు గణేశుడు. స్థూలమైన పనులు చేయగలడు, అతిసూక్ష్మమైన పనులు చేయగలడు. వినాయకుడి వాహనం ఎలుక. అక్కడ ఎలుక అంటే మనస్సుకు గుర్తు. ఎలుక రాత్రిళ్ళు తిరుగుతూ ఉంటుంది, మన మనస్సు అజ్ఞానం అనే చీకటిలో తిరుగుతూ ఉంటుంది. ఎలుక అది తిన్నది తినేసి పూరుకుంటుందా అంటే మిగతావి తన కన్నంలో పెట్టుకుంటూ ఉంటుంది, పాడుచేస్తూ ఉంటుంది. మన మనస్సు చేసేపని కూడా అదే ఎందుకు పనికిరాని గొడవలు అన్నీ దానికి కావాలి. ఆ ఎలుకను స్వాధీనం చేసుకొని గణేశుడు తన వాహనంగా పెట్టుకొన్నాడు, తన స్వాధీనంలో పెట్టుకొన్నాడు. కాబట్టి గణేశుడు ఈశ్వరుడై పోయాడు. అలాగ ఎవడైతే తన మనస్సును స్వాధీనంచేసుకొన్నాడో, ఎవడైతే తన మనస్సు మీదస్వారీ చేస్తున్నాడో, తన మనస్సును అదుపులో పెట్టుకొన్నాడో వాడు దేవుడు అవుతాడు, జ్ఞాని అవుతాడు. మన మనస్సును మనం స్వాధీనంలో పెట్టుకోకుండా ఎంత ప్రయత్నం చేసినా మనం జ్ఞానాన్ని సంపాదించలేము. ఓ అరుణాచలేశ్వరుడా ! జ్ఞానం లేకుండా నిన్ను పొందుదామని చూసాను కాని నీవు దొరకలేదు. జ్ఞానం వస్తేనే గాని నీవు దొరకవు అని అర్ధమయ్యాక జ్ఞానం కోసం ప్రయత్నం చేస్తున్నాను, నాప్రయత్నం ఒక్కటే సరిపోదు, నీ దయను చూపించి జ్ఞానాన్ని ప్రసాదించు అని భగవాన్ అక్షరమణమాలలో అన్నారు. గణపతి మనకు అన్ని విధాల గురువే, ఆయన నోరు చిన్నది, చెవులు పెద్దవి అంటే ఎక్కువ వినండి,

తక్కువ మాట్లాడండి అని చెప్పటం. ఎక్కువ వినటానికి చెవులు ఏమో చాట్లంత పెట్టుకొన్నాడు, తక్కువ మాట్లాడటానికి నోరుచిన్నది పెట్టుకొన్నాడు. మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకుపోయి విషయాలను అనుభవిస్తూ ఉంటుంది. మనస్సుఉంటే ఇంద్రియాలు ఉన్నాయి, మనస్సుఉంటే విషయాలు ఉన్నాయి, మనస్సు లేకపోతే ఏదీలేదు. మనస్సు ఉన్నవాడికి లోకం ఉంది కాని మనస్సు లేనివాడికి లోకం లేదు. బ్రాహ్మీస్థితిని పొందిన వాడిని మాత్రమే ఈ సంసారచక్రం విడిచిపెడుతుంది కాని మిగతా వారందరూ అలా జన్మిస్తూ ఉండాలి, మరణిస్తూఉండాలి. మీరు ఏదో చేస్తే ఏదోరావచ్చు కాని ఆత్మజ్ఞానం లేకుండా మోక్షం రాదు. అసలు మనస్థితి రూపస్థితి కాదు, అరూపస్థితే కాని అది జ్ఞానం లేకుండా మనం పొందలేము. షిరిడీబాబా దగ్గర నలుగురు భక్తులు కూర్చొన్నారు. ఈయన సరిగా సాధన చేయటం లేదు అని ప్రక్కన వాడినిచూపిస్తూ ఒక భక్తుడు అన్నాడు. బాబా ఏమిచెప్పారు అంటే సత్‌ప్రవర్తన లేనప్పుడు, వివేకవంతమైన జీవితం లేనప్పడు సాధన చేసినా ఫలించదు అనిచెప్పారు. మనకు రైట్‌బిహేవియర్ లేనప్పడు, రైట్ తింకింగ్ లేనప్పుడు, రైట్ స్పీచ్ లేనప్పుడు ఏదో ప్రాణాయామం చేసేస్తున్నాను, ధ్యానం చేసేస్తున్నాను అంటే చేస్తే చెయ్యండి కాని ఫలించదు అన్నారు బాబా. అంతా భగవంతుడే, మనం భగవంతుడి మీద భారం వేయలేకపోతున్నాము, ఆయన సంకల్పాన్ని గౌరవించలేకపోతున్నాము, ఆయన సంకల్పమే జరుగుతోంది అని మనకు అర్థం కావటం లేదు అందుచేత మనకు ఆందోళన వస్తోంది. రామచంద్రమూర్తిని అరణ్యానికి వెళ్ళమని వర్తమానం పంపినప్పుడు లక్ష్మణుడు చాలాకోపం చేసుకొన్నాడు కాని అప్పుడు రాముడు ఒక మాటచెప్పాడు, ఆశ్చర్యం. కైకేయి మనలను చాలా ప్రేమగా చూసింది. ఇవాళ మందర మాటలు విని ఇలా మారిపోవటానికి కూడా లోపల ప్రేరణ ఇచ్చింది ఈశ్వరుడే. అందుచేత ఇందులో ఆమె పొరపాటు లేదు. మన దేహప్రారబ్ధాన్ని బట్టి మనం అడవులకు వెళ్ళవలసి ఉంది, వారువూరికే దేవుని చేతిలోపనిముట్లుగా పనిచేసారు కాని జరిగేది ఈశ్వరసంకల్పమే. భగవంతుడు ఒకో శరీరాన్ని ఒకోలాగ ఉపయోగించుకొంటాడు, మనం అందరం ఆయనచేతిలో పనిముట్లమే కాని అది మనకు తెలియటంలేదు. సత్‌ప్రవర్తన చాలా ముఖ్యం. మనం ఇంద్రియాలను ఎలా ఉపయోగించుకోవాలి అంటే కళ్ళతో మంచి విషయాలు చూడాలి, చెవులతో మంచి మాటలను వింటూ ఉండాలి. చేతులతో మంచిపనులు చేయాలి. నోటితో మంచి మాటలు మాట్లాడాలి, మనస్సుతో మంచి విషయాలు ఆలోచించాలి, ఇలా ఇంద్రియాలను మంచికి ఉపయోగించుకోవాలి. అసలు మంచితనం లేకుండా ఎవడికి ఆత్మజ్ఞానం కలుగదు. భగవంతుడిని మనం వంచన చేయలేము. కొంతమంది కుయుక్తులతో, కుతంత్రంగా మాట్లాడతారువారికి సాధన చేసినా జ్ఞానం రాదు. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని మనం ప్రమాణంగా తీసుకొని నడుచుకోవాలి. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని ప్రమాణంగా తీసుకొంటే భగవంతుడి వాక్యం నందు మనకు విశ్వాసం కుదిరితే భగవంతుడు తనస్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే జ్ఞానం. నీకు తలంపులు వచ్చినప్పుడు వాటికూడా పోతూ ఉంటే నీకు చావటం,

పుట్టటం తప్పదు. ఆ తలంపులకూడా పరిగెట్టవద్దు, వాటిని అతిక్రమించాలి. ఆతలంపులను యాక్షన్‌లో పెట్టకుండా వాటిని విడిచిపెట్టడానికి ప్రయత్నంచేయాలి. అష్టావక్రుడికి శరీరంలో అష్టవంకరలు ఉన్నాయి. వాడు జనకమహారాజు సభలోనికి మొదటిసారి వెళ్ళినప్పుడు వాడిని చూసి అందరూ ఫక్కున నవ్వారు. మనం అయితే ఏమిటి ఇలా నవ్వుతున్నారు అని కంగారు పడిపోతాము కాని ఆయన కంగారుపడలేదు, ఆయన మహాజ్ఞాని, ఓరాజా! ఏమిటి వీరికి శరీరభావన ఒక్కటే ఉంది. కాని ఆత్మభావనలేదు, ఇటువంటి మూర్ఖులను పెట్టుకొని ఎలా పరిపాలిస్తున్నావయ్యా అన్నాడు అష్టావక్రుడు, అది జ్ఞానంయొక్క బలం. మనకు నేను అనే తలంపు అందరికి ఉంది అది సమిష్టి తలంపు. ఈనేను అనే తలంపుకు కొంతమందికి మంచితలంపులు రావచ్చు, కొంతమందికి చెడ్డతలంపులు రావచ్చు కాని నేను అనే తలంపు లేనివాడు ఎవడు ఉన్నాడు? ఒక్క ఆత్మజ్ఞానిని తప్పించి అందరినీ ఈ సమిష్టితలంపు, మూలతలంపు వెంటాడుతుంది. ఈమూలతలంపే జీవుడు. ఇది ఒకముడి అన్నారు భగవాన్. చైతన్యం తాలుక కొంత, జడం తాలూక కొంత కలిపి నేనుగా ఏర్పడింది. మనం ఏమిచెయ్యాలి అంటే మూలతలంపుకు ఉన్న జడత్వాన్ని తగ్గించుకొంటే అది చైతన్యం వైపుకు వెళ్ళిపోయి చైతన్యంలో ఐక్యమయిపోతుంది. మనలో మంచి, చెడ్డ ఉన్నాయి అనుకోండి చెడ్డను తగ్గించుకొంటూ, మంచిని పెంచుకొంటూ రావాలి. ఇది ఒక ముడి, చైతన్యాన్ని జడాన్ని కలుపుతోంది, ఈ ముడిని విప్పితేనే గాని సంసారంలో నుండి మనిషి బయటపడలేడు, ఓ అరుణాచలేశ్వరుడా! ఈముడిని విప్పేటప్పుడు నాకు బాధ లేకుండా, నాకు తెలియకుండా ఈ చిజ్జడగ్రంథిని కట్‌చెయ్యి అన్నారు భగవాన్. మూలతలంపు దాని మూలాన్ని చూస్తేకాని అది అదృశ్యమవ్వదు. అది అదృశ్యమవ్వటం, మూలతలంపు మూలంలో ఉన్న భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవ్వటం ఒకేసారి జరిగిపోతాయి. కొంతమంది పూర్వజన్మల్లో కష్టపడి సాధన చేసివస్తారు, ఈ జన్మలో తేలిగ్గావారు జ్ఞానాన్ని పొందేస్తారు. ఏమిటివారికి అంత తేలికగా జ్ఞానం వచ్చేసింది అని మనం అనుకొంటాం. కానివారు పూర్వజన్మలో ఎంతకష్టపడ్డారో మనకు తెలియదు. మన దేహంద్వారా ఏదైనా మనం సాధించినా అది ఈశ్వరుడే సాధించాడు కాని ఈ దొంగనేను ఏమిసాధిస్తుంది, అంటే భగవంతుడు చేసిందే మన మీద పెట్టుకొని మనంచేసాము అనుకొంటాము. ఇదేమాయ. మనం ఎవరికైనా ఏదైనా మిఠాయి పెట్టాము అనుకోండి, ఆ మిఠాయి ఇచ్చింది భగవంతుడే, అక్కడతినే వాడుకూడా భగవంతుడే, అలా అనుకొంటే మనంమాయలో పడము, అలా ఉంటే జీవలక్షణాలు పోతాయి. కొంతమంది ఎలా ఉంటారు అంటే భగవంతుడు ఒకవాక్యం చెపితే ఆవాక్యాన్ని పట్టుకొని ఉండి భగవంతుడిలో ఐక్యమయిపోతారు ఎందుచేతనంటే వారికి శంకలు ఏమీ ఉండవు మనం భగవంతుడు చెప్పినవాక్యాన్ని నమ్మం కారణం ఏమిటి అంటే మనం పూర్వజన్మలో మంచిపనులు ఏమీ చేయలేదు, మంచిమాటలు ఏమివినలేదు, మనకుసంస్కారం, సభ్యతలేదు అందుచేత మనకు యింక శంకలే మిగులుతాయి. నీవు పూజచెయ్యి, జపంచెయ్యి యాంత్రికంగా చెయ్యవద్దు, చిత్తశుద్ధి ఉండాలి. నీమాటలో, చేతలో,

ఆలోచనలో చిత్తశుద్ధి ఉండాలి. చిత్తశుద్ధి లేనివాడికి శివుడు తనస్వరూపాన్ని ఇవ్వడు. వినాయకుడి భార్యలపేర్లు బుద్ధి, సిద్ధి. బుద్ధి అంటే జ్ఞానం, సిద్ధి అంటే సంపద, ఎవరైతే వినాయకుడిని అర్చన చేస్తున్నాడో, ఆయన రూపాన్ని ఎవడైతే హృదయంలో పోషించుకుంటున్నాడో వాడికి జ్ఞానం, సంపద రెండూవస్తాయి అంటే ఇహం పరం రెండూ వచ్చేస్తాయి, వాడే గణపతి. కొబ్బరికాయ అహంకారానికి గుర్తు, నువ్వు కొబ్బరికాయని పగులకొట్టావా నీకేమీనష్టం లేదు నీళ్ళే నీళ్ళు, గుంజే గుంజు. అలాగే అజ్ఞానము అనే కొబ్బరికాయను పగులకొట్టావాలోపల ఉన్నది జ్ఞానమే జ్ఞానం, శాంతే శాంతి. కాలవలోనుండి బోదెలోనికి తూర ఉంటుంది. తూర ఉన్న మాటనిజమే కాని అందులోమట్టి ఉంది అనుకోండి కాలువలోని నీరు బోదెలోనికి రాదు. అదే విధంగా ఆధ్యాత్మికహృదయంలో నుండి సహస్రారానికి ఒకనాడి ఉంది, అది ఎప్పుడూ మూసుకొని ఉంటుంది. సాధన చేసి, సాధనచేసి హృదయంలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుని దయవలన మనం ఆనాడిని ఓపెన్‌చెయ్యగలిగితే తూరలో ఉన్న మట్టిని తీసివేస్తే కాలువలో ఉన్న నీరు సడన్‌గావచ్చి బోదెలో ఎలా పడిపోతుందో అలాగ సుఖసముద్రం పొంగి వచ్చి మన సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పుడు మరణం ఏమిటి ? పుట్టుక ఏమిటి? స్నేహితులు ఏమిటి? విరోధులు ఏమిటి? ఏమీలేదు, నీకు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే.

హిందువులు అందరూ ఏదో విగ్రహాలనుపట్టుకొని, నామాలను పట్టుకొని ఉంటున్నారు అని ఇతర మతస్థులు అంటారు. ఇప్పుడు కాలిలో ముల్లు విరిగింది అనుకోండి. ఇంకోముల్లు తెచ్చుకొని దానితో ఈముల్లుని తీసేస్తాము. తరువాత ఈతెచ్చుకొన్న ముల్లును జేబులో పెట్టుకోము, రెండు ముళ్ళను బయటపడేస్తాము అలాగే మన రూపబుద్ధినుండి, నామబుద్ధినుండి విడుదలపొందటానికి ఒక దేవతాపురుషుడినిగాని, గురువునుగాని ఆశ్రయిస్తాము. ఇది పోయిన తరువాత అదికూడా సహజంగానేపోతుంది. వినాయకుడి పొట్టకూడా మనకు గురువు. ఆయనకు పెద్దపొట్ట ఉంటుంది. కుడుములు, ఉండ్రాళ్ళు అన్నీ తినేసి జీర్ణంచేసేసుకొంటాడు, అలాగే జీవితం అన్నాక కష్టసుఖాలు, లాభనష్టాలు, శుభం అశుభం అన్నీ వస్తాయి వాటిని మనం భరించగలగాలి. వినాయకుడి బొమ్మను తొమ్మిది రోజులు పూజించి పదవరోజున నీటిలో కలిపేస్తున్నారు ఏమిటి అనిఅడుగుతున్నారు. ఆబొమ్మను మట్టితో చేస్తున్నారు, దానిని నీటిలో కలిపితే ఆబొమ్మ దానిరూపాన్ని పోగొట్టుకొంటుంది, దానిరూపాన్ని పోగొట్టుకొని అనంతమై పోతుంది. అలాగే మనంకూడా మనరూపబుద్ధి నుండి, నామబుద్ది నుండి విడుదల పొందినప్పుడు మనం అనంతమై పోతాము అంటే అంతటాఉంటాము, దానిగుర్తు కోసమే వినాయకుడి బొమ్మను నీటిలో కలపటం. మనకు ఆపని ఉంది, ఈపని ఉంది, అది సాధించాలి, ఇది సాధించాలి అంటే జన్మలు రాకుండా ఎలా ఉంటాయి. ఇంకా ఎన్నిశవాలను మోయాలో మనం. కాళ్ళుచేతులు పనిచేస్తూ ఉంటాయి, పనిచెయ్యనియ్యి, నీ మనస్సులో ఈశ్వరభావన, దైవచింతన విడిచిపెట్టవద్దు. కర్తృత్వం లేనివాడు నిజమైన మంచివాడు, వాడు పనిచేస్తాడుకాని

నేనుపనిచేస్తున్నాను అనే తలంపువాడికి ఉండదు. భగవాన్‌కు మరణానుభవం కలిగాక స్నేహితులు స్నేహితులుగా కనబడేవారుకాదు, విరోధులు విరోధులుగా కనబడేవారు కాదు, చుట్టాలుచుట్టాలుగా కనబడేవారు కాదు ఎందుచేతనంటే ఈ చుట్టం దొంగనేనుకే, విరోది దొంగనేనుకే, స్నేహితులు దొంగనేనుకే, ఆదొంగనేను పోయింది ఆయనకు. అప్పుడు ఇంక వీడు స్నేహితుడు అని, వీడు విరోధి అని, వీడు చుట్టం అని ఆతలంపులు ఉండవు ఎందుచేతనంటే ఆసమిష్టినేను పోయింది. నువుచేస్తున్న సాధన నిజమైతే, సత్యాన్వేషణ నిజమైతే, ఆతపన నిజమైతే సమాజంలో కనిపించే వ్యక్తులపట్ల, జీవితంలో జరిగే సంఘటనలపట్ల నీ దృక్పదమే మారిపోతుంది., నీ ఆలోచనాధోరణే మారిపోతుంది. ఇప్పుడు మీరు ఆలస్యంగా ఇంటికివెళ్ళారు అనుకోండి, ఇంత ఆలస్యంగావచ్చావు ఏమిటి అని మీ అత్తగారికి కోపంవచ్చింది అనుకోండి, మామూలుగా అయితే మీ అహంకారానికి గాయం తగులుతుంది. కాని మీ అన్వేషణ నిజమైతే మీ అత్తగారిమాటలు మీకు ఏమీఅనిపించవు, కనీసం ఎర్రచీమకుట్టినట్లుగా కూడా ఉండదు. అప్పుడు కూడా నీవు పనిచేస్తావు కాని మమకారం లేకుండా పనిచేస్తావు నీ సాధన నిజమైతే. మనదగ్గర పొరపాటు ఎక్కడ ఉంది అంటే జీవితంలోనుండి నేర్చుకోవలసిన పాఠాలు చాల ఉంటాయి కాని నేర్చుకోవటం మానివేస్తున్నాము. జీవితం నేర్పేపాఠాలు ఎవడైతే నేర్చుకొంటున్నాడో వాడికి జ్ఞానం కలుగుతుంది. మనం మమకారంతోపనిచేస్తే అజ్ఞానంలో కూరుకొనిపోతాము. మమకారంలేకుండా చేసేపని అజ్ఞానంలో నుండి బయటకు రావటానికి సహాయ సహకారములు అందిస్తుంది. రమణమహర్షిగారికి ఏమీలేదు, మనకి అన్నీ ఉన్నాయి. మనకు అన్నీఉండి దుఃఖంలో పడిఉన్నాము, ఆయనకు ఏమీలేకుండా సుఖాన్ని జుర్రుకొంటున్నాడు. ఆయన అదృష్టవంతుడా? మనం అదృష్టవంతులమా? మనకు అన్నీఉన్నాయి, వాటికి మనం పాలేరుతనం చేస్తున్నాము అన్న సంగతి మనకుతెలియటంలేదు. చివరికి ఎప్పుడో కళ్ళుమూస్తాం, ఇదంతా ఒక్కడే తినేస్తాడు. బతికి ఉండగా పెట్టుకొంటే పదిమందికి పెట్టుకోవచ్చు సడన్‌గా చనిపోతే వాడిడబ్బంతా ఎవడో ఒకడుతినేస్తాడు. మనకు అన్నీ ఉండి ఎందుకు సుఖపడలేకపోతున్నాము అంటే మనకు కర్తృత్వం ఉంది, కర్తృత్వం ఉన్నంతకాలం దుఃఖం మనలను విడిచిపెట్టదు. కర్తృత్వం నశిస్తే వాడు గృహస్థుడు అయినా, సన్యాసి అయిన వాడు నిజమైన సుఖి అవుతాడు. మనం ఏదైనా ఊరు వెళుతున్నాము అనుకోండి, స్టేషనుకు వచ్చి ఎవరు రిసీవ్ చేసుకొంటారు, అక్కడమనకు బంధువులు ఎవరు ఉన్నారు, స్నేహితులు ఎవరు ఉన్నారు. స్టేషన్ నుండి కారులో వెళదామా, బస్సులో వెళదామా అని వందప్లానులు వేసుకొంటాము. రమణమహర్షి గారు అరుణాచలం పుణ్యభూమిమీద 1896వ సం॥ సెప్టెంబరు 1వ తేదీన అడుగుపెట్టారు. అక్కడ ఒక చుట్టంలేడు, స్నేహితుడు లేడు, నాఅని పలకరించే వాడు లేడు, కష్టసుఖాలను చూసేవాడు లేడు, నూటికి నూరుపాళ్ళు అరుణాచలేశ్వరుడి మీద ఆధారపడివచ్చి ఆభూమిమీద అడుగుపెట్టారు, పోనీ పెద్దవాడా అంటే 16 సం॥ల బాలుడు, అది కంప్లీటెస్ట్ సరెండర్ టు ది విల్ ఆఫ్ అరుణాచలా!

# సద్గురు శ్రీనాన్నగారి 71 వ జన్మదినమహోత్సవము

## ది. 23-09-2004, శ్రీరమణక్షేత్రం, జిన్నూరు









అరుణాచల గిరి తిరువన్నామలై

REGISTERED NEWS PAPER

RNI NO. APTEL/1999/1667
Postal Regn.No.PMG/VJ/1-3/03
Prepayment : Tech-31/Pre.Pmt/BMV/02

Postage Prepaid

To
301. P. Sandhya, C/o P.V.S.V.K. Varma, D.No. 151, Rao & Raju Colony, BanjaraHills, Road No-2,
HYDERABAD - 500034

If undelivered please return to :
**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM
JINNURU - 534 265. W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, Palakol - 534 265. W.G.Dt. ✆ 08814 224589, 224689
Printed at : **SHRIRAM GRAPHICS,** Bank Street, Palakol - 534 260. W.G.Dt., ✆ 222438